కొండాపూర్‌లో మహిళా శక్తి క్యాంటీన్‌ ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య

ఘట్‌కేసర్‌: మేడ్చల్‌ జిల్లా కలెక్టర్‌ ఆదేశానుసారం మున్సిపాలిటీలోని కొండాపూర్‌లో బుధవారం ఇందిర మహిళ శక్తి (మహిళా క్యాంటీన్‌) క్యాంటీన్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయయ, వైస్‌ చైర్మన్‌ మాధవరెడ్డి, కమిషనర్‌ సాబేర్‌ అలీ హాజరై క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్‌, హేమలత, నరసింహ, దుర్గ మల్లేశ్వరీ, మహిళా రీసోర్స్‌ పర్సన్‌, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గురుకుల్‌ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థి మండలి ఎన్నిక



గురుకుల్‌ విద్యార్థి మండలితో ప్రిన్సిపాల్‌ రాధిక, వైస్‌ ప్రిన్సిపాల్‌

ఘట్‌కేసర్‌: అంకుషాపూర్‌లోని ఇబ్రహీంపట్నం గురుకుల్‌ మహిళ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆ కళాశాల విద్యార్థి మండలిని ఎన్నుకున్నారు. కెప్టెన్‌గా దయానా, వైస్‌ కెప్టెన్‌గా, ప్రధాన కార్యదర్శి, మెస్‌ లీడర్‌, లైబ్రరీ లీడర్‌, కల్చరల్‌ లీడర్‌, స్పోర్ట్స్‌ లీడర్‌ పదవులకు ఓటింగ్‌ నిర్వహించి మండలిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ రాధిక మాట్లాడుతూ... విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం అలవరచడానికి ఎన్నికలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ పద్మమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

గురుకులాల్లో తొలగించిన పార్ట్‌టైం టీచర్లను తీసుకోవాలి

సాక్షి, సిటీబ్యూరో: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలలో తొలగించిన 6000 మంది గురుకుల పార్ట్‌ టైమ్‌ టీచర్లు, 33 సీఓఈ లల్లో పని చేస్తున్న 216 సబ్జెక్ట్‌ అసోసియేట్స్‌ టీచర్లను వెంటనే తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్‌) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర డిమాండ్‌ చేశారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణీ వారిని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేయటం దారుణమన్నారు. కాంట్రాక్ట్‌ ఉద్యోగులుగా అప్‌గ్రేడ్‌ చేస్తామని చెప్పి, గురుకుల కార్యదర్శి తొలగింపు నిర్ణయం తీసుకోవటం అప్రజాస్వామికమన్నారు. వీరికి మూడు నెలలుగా జీతాలు కూడా ఇవ్వడం లేదన్నారు. గురుకుల పార్ట్‌ టైమ్‌ టీచర్ల తొలగింపుపై ముఖ్యమంత్రి స్పందించాలని డిమాండ్‌ చేశారు. తొలగించిన టీచర్లను విధుల్లోకి తీసుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

నాడెం చెరువు పరిశీలన



అరుంధతీ నగర్‌ కాలనీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గీతారెడ్డి, ఇరిగేషన్‌ ఈఈ

ఘట్‌కేసర్‌: కలెక్టర్‌ ఆదేశానుసారం వెంకటాపూర్‌ నాడెం చెరువును ఎంపీడీఓ గీతారెడ్డి, ఇరిగేషన్‌ ఏఈ పరమేశ్‌తో కలిసి బుధవారం సందర్శించారు. చెరువు తూమును సందర్శించారు. తూము ద్వారా ప్రవహిస్తున్న నీరు, అనంతరం ముంపునకు గురైన సమీపంలోని అరుంధతీ నగర్‌ కాలనీలో ఇళ్లను పరిశీలించారు. నీరు బయటకు వెళ్లేందుకు మ్యాన్‌ హోళ్లను తెరిపించారు. కార్యదర్శి శశిధరన్‌, మత్స్యకార సంఘం చైర్మన్‌ లింగం ముదిరాజ్‌, మాజీ సర్పంచ్‌ వేణుగోపాల్‌ ముదిరాజ్‌, మాజీ ఎంపీటీసీ రామారావు ముదిరాజ్‌, శ్రీనివాస్‌ ముదిరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల్‌ మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్‌ అడ్మిషన్లు

ఘట్‌కేసర్‌: అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంక్షేమ సంక్షేమ గురుకుల్‌ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏలో హెచ్‌ఈపీ, హెచ్‌ఈపీఏ, ఈఐఆర్‌పీ, ఈపీజే, ఈపీజే, ఈపీఎస్‌, హెచ్‌పీఎస్‌, హెచ్‌పీవైఎస్‌, ఈపీపీ గ్రూపులలో ఈ నెల 5, 6 తేదీల్లో స్పాట్‌ అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ రాధిక తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులై దోస్త్‌లో రిజిస్ట్రేషన్‌ చేసుకున్న విద్యార్థులు అర్హులన్నారు. అంకుషాపూర్‌ ప్రిన్సిపాల్‌ ఇంజినీరింగ్‌ కళాశాల ప్రాంగణంలోని ఇబ్రహీంపట్నం మహిళా డిగ్రీ కళాశాలకు ఒరిజినల్‌ సర్టిఫికెట్లు, రెండు జిరాక్స్‌ సెట్లు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం ఫోన్‌: 94418 68332లో సంప్రదించాలన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న మత్స్యకారులు

ఘట్‌కేసర్‌: రెండు, మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఎదులాబాద్‌ శ్రీ లక్ష్మీనారాయణ చెరువు నిండింది. మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో నీరు పారుతున్న అలుగు వద్ద గంగపుత్రులు బుధవారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు యాదగిరి, కార్యదర్శి నర్సింగ్‌రావు, రాజు, శ్రీనివాస్‌, బాలకృష్ణ, బాలనర్సింహ్మా, వెంకటేశ్‌, నర్సింగ్‌రావు, భిక్షపతి, అశోక్‌, యాదగిరి పాల్గొన్నారు.

నారాయణ కళాశాలపై ఎస్‌ఎఫ్‌ఐ ఫిర్యాదు

పోచారం: అన్నోజిగూడలోని నారాయణ జూనియర్‌ కళాశాలలో ఇంటర్‌ ప్రథమ సంవత్సరం చదువుతున్న మణికుమార్‌(16) తలపై కొట్టిన అధ్యాపకుడు క్రాంతిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారి కిషన్‌ నాయక్‌కు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం మణికుమార్‌ పరిస్థితి విషమంగా ఉందని, ఐసీయూలో చికిత్స తీసుకుంటున్నాడని చెప్పారు. స్టూడెంట్‌ను దండించిన లెక్చరర్‌తో పాటు కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ ప్రధాన కార్యదర్శి రాథోడ్‌ సంతోష్‌ ఈ సందర్భంగా డిమాండ్‌ చేశారు.

వణుకు పుట్టిస్తున్న వర్షం!



మేడ్చల్‌-కిష్టాపూర్‌ రోడ్డులో రోడ్డు పై నుంచి ప్రవహిస్తున్న నీరు

వర్షం పడితే రాకపోకలు బంద్‌

- ప్రధాన మార్గంలో వాగులు బ్రిడ్జిల పై నుంచి ప్రవహిస్తుండటంతో నిలిచిపోతున్న రాకపోకలు
- నగరానికి చేరువగా ఉన్న మెరుగుపడని వ్యవస్థ

మేడ్చల్‌: మేడ్చల్‌ నియోజకవర్గంలోని ఒక్క రోజు భారీ వర్షం కురిసి వాగులు పొంగితే రెండు రోజుల పాటు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రత్యామ్నాయ మార్గాలు ఉండటంతో ఆ గ్రామస్థులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. ప్రధాన రోడ్లలో పురాతన కాలం నాటి పద్ధతిలో లో లెవల్‌ బ్రిడ్జిలే ఉండటంతో వాగులు పొంగుతూ రోడ్లపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో ఆ రోడ్లగుండా రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండల కేంద్రంతో రాకపోకలు తెగిపోతున్నాయి.

రెండు మండలాల్లో...

నియోజకవర్గంలో ప్రధానంగా మేడ్చల్‌, శామీర్‌పేట్‌ మండలాల్లో వర్షాలు పడితే మేడ్చల్‌-గౌడవెల్లి, మేడ్చల్‌-కిష్టాపూర్‌, గుండ్లపోచంపల్లి-నూతన్‌కల్‌ రూట్లు, లింగాపూర్‌ డబీల్‌పూర్‌, నూతన్‌కల్‌-మేడ్చల్‌ రూట్లో లో లెవల్‌ బ్రిడ్జిలు ఉండటంతో బ్రిడ్జిల కింద నుంచి వెళ్లాల్సిన నీరు పై నుంచి ప్రవహిస్తుండటంతో రాకపోకలకు పూర్తిగా అంతరాయం ఏర్పడుతుంది.

- శామీర్‌పేట చెరువు నుంచి నీరు క్రిందికి ప్రవహిస్తుండటంతో అలియాబాద్‌ వద్ద వాగు ఉదృతంగా ప్రవహిస్తుండటంతో బాబాగూడ-అలియాబాద్‌ రోడ్డును మూసివేస్తున్నారు. ఉద్దమర్రి వద్ద ఉద్దమర్రి-మూడు చింతలపల్లి రోడ్డును ప్రతి సంవత్సరం మూసి వేస్తుంటడంతో గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- గుండ్లపోచంపల్లి-నూతన్‌కల్‌ రూట్లో రాయిలాపూర్‌ శివార్ల, మేడ్చల్‌ కిష్టాపూర్‌ రూట్లో మేడ్చల్‌ శివారులో, లింగాపూర్‌ గ్రామం వద్ద, నూతన్‌కల్‌ వద్ద బండమాదారం రూట్‌లో గ్రామ శివారు వద్ద, రావల్‌కోల్‌-మేడ్చల్‌ రూట్లో, రావల్‌కోల్‌-మేడ్చల్‌ వయా జయదర్శిని రూట్‌లో కల్వర్టులు రోడ్డు కంటే కిందకు ఉండటం, మేడ్చల్‌-గిర్మాపూర్‌ రూట్లో వరద నీరు వెళ్లే రైల్వే అండర్‌ పాస్‌ బ్రిడ్జి కింద నుంచి రోడ్లు ఏర్పాటు చేయడంతో చెరువులు పొంగినా, జోరుగా వర్షాలు కురిసినా వాగులు జోరుగా ప్రవహిస్తు వరధ ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో మనిషి ఎత్తులో రోడ్లపై నుంచి నీరు ప్రవహిస్తున్నాయి. దీంతో ఈ రూట్లలో పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- మేడ్చల్‌ మండలంలో దాదాపు అన్ని గ్రామాలలో రియల్‌ దందా జోరుగా ఉండటంతో పోలాలు తగ్గి ప్లాట్లు ఎక్కువగా మరాయి. దీంతో చెరువుల కింద ఆయకట్టు పూర్తిగా తగ్గిపోయింది.దాదాపు అన్ని గొలుసు కట్టు చెరువులు కుంటలు కావడం, రెండు మూడేళ్ల నుంచి అన్ని నీటితో నిండిఉండటంతో చిన్నపాటి వర్షానికే పొంగిపొర్లుతున్నాయి. భవిష్యత్‌లో కూడా ఇలాగే ఉండే పరిస్థితి కనిపిస్తుంది. దీంతో చిన్నపాటి వర్షాలకు చెరువులు, కుంటలు పొంగడంతో వాగులు దిగువ చెరువులోకి చేరడానికి నీటితో నిండుగా వెళుతూ రోడ్లపైకి నీటిని నింపుతున్నాయి. దీంతో అందరికీ ఇబ్బందులు ఏర్పడటమే కాకుండా రోడ్లు దెబ్బతింటున్నాయి.
- వర్షం వచ్చిన ప్రతిసారీ గ్రామాల నుంచి నగరానికి, మేడ్చల్‌కు వెళ్లాలంటే బండమాదారం, శ్రీరంగవరం, రాయిలాపూర్‌, గిర్మాపూర్‌, ఉద్దెమర్రి, బాబాగూడ తదితర గ్రామాల ప్రజలతోపాటు మేడ్చల్‌లో పలు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, పాలకులు వర్షం పడిన సమయంలో తాత్కాలిక మరమ్మతులు చేయడం మాని శాశ్వత పరిష్కారాలు చూపాలని ఆ ప్రాంతాల ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు. రోడ్లపై నుంచి నీరు ప్రవహించకుండా కల్వర్టులను తొలగించి నూతన బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని. లోలెవల్‌ బ్రిడ్జిల నిర్మాణం పాత పద్ధతి కావడంతో దానికి స్వస్తి పలికి బ్రిడ్జిల నిర్మాణం చేస్తేనే సమస్య శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు. తాత్కాలిక మరమ్మతులతో ఏటా వర్షా కాలంలో ఇబ్బందులు తప్పడం లేదు.



మేడ్చల్‌-గాడవెళ్లి రోడ్డులో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న నీరు



ఉద్దమర్రి వద్ద నీటిలో ఉద్దమర్రి- మూడుచింతలపల్లి రోడ్డు



రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న బాబాగూడ- అలియాబాద్‌ వాగు

చట్టపరమైన నియంత్రణ ప్రమాణాలకు కట్టుబడి ఉండాలి

జిల్లా అదనపు కలెక్టర్‌ రాధికాగుప్తా

సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేట్‌ హెల్త్‌కేర్‌ నిపుణులు పూర్తి సమాచారంతో చట్టపరమైన నియంత్రణ ప్రమాణాలకు కట్టుబడి ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా అదనపు కలెక్టర్‌ రాధికా గుప్తా (లోకల్‌ బాడీస్‌) తెలిపారు. బుధవారం నీలిమ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడికల్‌ సైన్సెస్‌లో ప్రైవేట్‌ ఆస్పత్రుల డయాగ్నోస్టిక్‌ సెంటర్‌, మేనేజింగ్‌, మెడికల్‌ డైరెక్టర్లు, గైనకాలజిస్ట్‌, రేడియాలజిస్టులు, పాథాలజిస్టులకు పర్యవేక్షణపై ఓరియంటేషన్‌ నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ టి.రఘునాథ్‌ స్వామి మాట్లాడుతూ... వైద్య ఉద్యోగులకు అందించే శిక్షణ ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలలో విధానాలను ప్రమాణీకరించడానికి, సంరక్షణ నాణ్యతలో ఏకరూపతను నిర్ధారించడానికి ఉపయోగపడాలన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా శ్రీనివాస్‌



కీసర: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ప్రకటించే రాష్ట స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా కీసరగుట్ట తెలంగాణ గురుకుల పాఠశాల్లో ఆర్ట్‌ టీచర్‌గా పనిచేస్తున్న గాజుల శ్రీనివాస్‌ ఎంపికయ్యారు. జులై 3న కీసరగుట్ట గురుకుల పాఠశాలకు బదిలీపై వచ్చినట్లు.. అంతకుముందు నిజామాబాద్‌ జిల్లా టీజీఆర్‌ఎస్‌ పోచంపాడు, స్కూల్‌లో ఆర్ట్‌ టీచర్‌గా, ఎన్‌సీసీ టీచర్‌గా పని చేశానన్నారు. ఈ అవార్డు ఎంపిక కావడం పట్ల తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. నిజామాబాద్‌ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నానన్నారు. మహానేత డాక్టర్‌ వై.ఎస్‌.రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో పరేడ్‌ గ్రౌండ్‌లో నిర్వహించిన ఎన్‌సీసీ డే పరేడ్‌లో పరేడ్‌ కమాండర్‌గా కవాతు నిర్వహించినందుకు అప్పట్లో వైఎస్సార్‌ చేతుల మీదుగా బెస్ట్‌ ఏఎన్‌ఓగా సిల్వర్‌ అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు. నగరంలోని రవీంద్రభారతిలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డిచేతుల మీదుగా గాజుల శ్రీనివాస్‌ అవార్డు అందుకోనున్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



శామీర్‌పేటలో చెక్కులను అందజేస్తున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట్‌: ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌, మేడ్చల్‌ ఎమ్మెల్యే మల్లారెడ్డి సూచించారు. బుధవారం శామీర్‌పేట ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ పథకాల కింద మంజూరైన నిధులకు సంబంధించి చెక్కులను లబ్ధిఇదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు కలిసి 187 చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరేలా అధికారులు కృషిచేయాలని సూచించారు. డీసీఎంఎస్‌ వైస్‌ చైర్మన్‌ మధుకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు యెల్లుబాయి, చంద్రశేఖర్‌యాదవ్‌, మాజీ జెడ్పీటీసీ అనిత, కాంగ్రెస్‌ పార్టీ తూంకుంట మున్సిపల్‌ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఎంసీ పల్లి అధ్యక్షుడు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు...

కీసర: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సకాలంలో అందేలా చర్యలు చేపట్టామని ఎంపీ ఈటల రాజేందర్‌, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. కీసర మండల పరిషత్‌ కార్యాలయం వద్ద వివిధ గ్రామాలకు చెందిన సుమారు 59 మంది లబిద్ధదారులకు మంజూరైన షాదీముబారక్‌, కల్యాణలక్ష్మి చెక్కులను వారు పంపిణీ చేశారు. తహసీల్దార్‌ అశోక్‌కుమార్‌, ఎంపీడీఓ గ్యాం, మాజీ జెడ్పీటీసీ వెంకటేష్‌, నాయకురాలు మాధురి, కాంగ్రెస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రామిడి స్వప్న విజయ్‌రెడ్డి, కాంగ్రెస్‌, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టకు యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయండి

మేడ్చల్‌: భారీ వర్షాలతో మేడ్చల్‌ పెద్ద చెరువు కట్టపై పడ్డ భారీ రంధ్రాన్ని జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. కట్టపై ఆయన రంధ్రాన్ని పరిశీలించి దాని మరమ్మతుల కోసం చేపట్టాల్సిన చర్యలను సూచించారు. పట్టణం మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతుండటం, కట్టపై ఉన్న రోడ్డు ప్రత్యామ్నాయ రోడ్డుగా ఉండటంతో చెరువు కట్టపై రోడ్డును యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయాలని సూచించారు. కట్టకు పడ్డ రంధ్రాన్ని పూడ్చి పూర్తి మరమ్మతులు చేయాలని సూచించారు. ఎన్‌హెచ్‌ఎఐ అధికారులతో సమన్వయం చేసుకుని పనులు త్వరగా పూర్తిగా చేయాలని కోరారు. వినాయక నిమజ్జనం పెద్ద చెరువులో చేయనుండటంతో త్వరగా పట్టిష్టంగా మరమ్మతులు చేయాలని సూచించారు. మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ దీపిక నర్సింహారెడ్డి, కౌన్సిలర్లు, ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, కమిషనర్‌ నాగిరెడ్డి, పోలీసు, ఇరిగేషన్‌, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నల్లా బిల్లులు రద్దు చేయాలని వినతి



వినతిపత్రమిస్తున్న కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా సవ్యంగా లేనందున నల్లా బిల్లులు రద్దు చేయాలని జలమండలి మేనేజింగ్‌ డైరెక్టర్‌ కె.అశోక్‌రెడ్డికి మున్సిపల్‌ చైర్మన్‌ బి.కొండల్‌రెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఇస్మాయిల్‌ఖాన్‌ గూడ, నారపల్లి, యంనంపేట్‌, పోచారం తదితర ప్రాంతాల్లో నీటి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంతో పేర్కొన్నారు. బలహీన వర్గాల కాలనీలు, పాత గ్రామాల్లో కొత్తగా పైప్‌లైన్‌లు వేయాలని, ట్యాంకులు కట్టిన చోటు నీరు నింపించాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కౌన్సిలర్లు జి.మహేష్‌, రాజశేఖర్‌, నాయకుడు నర్రి కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల సమస్య పరిష్కారానికి చర్యలు

మల్కాజిగిరి: బండచెరువు దిగువ కాలనీలో ముంపు సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని జోనల్‌ కమిషనర్‌ రవికిరణ్‌ అన్నారు. బుధవారం అనంతసరస్వతీనగర్‌ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న ముంపు సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. ముంపు సమస్య పరిష్కారానికి బాక్స్‌డ్రైన్‌ (నాలా) అలైన్‌మెంట్‌ ప్రకారం నిర్మించకుండా రాజకీయ నేతల ఒత్తిళ్లతో మార్చారని దీంతో సమస్య పరిష్కారం కాలేదన్నారు. డీసీ రాజు, అధికారులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల విలీనంపై హర్షం

ఘట్‌కేసర్‌: ఘట్‌కేసర్‌లో మున్సిపాలిటీలో అవుషాపూర్‌, అంకుషాపూర్‌, మాదారం గ్రామాలను విలీనం చేయడం పట్ల కాంగ్రెస్‌ పార్టీ మండల అధికారి ప్రతినిధి కవాడి మాధవరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ... మూడు గ్రామాలను బీబీనగర్‌ మండలంలో విలీనం చేస్తారని వచ్చిన పుకార్లతో ఆందోళన చెందామన్నారు. ఘట్‌కేసర్‌ మున్సిపాలిటీలో కలిపేందుకు మాకు సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబు, టీ పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌ యాదవ్‌, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

పోచారం మున్సిపల్‌ కమిషనర్‌గా వీరారెడ్డి



పోచారం: పోచారం మున్సిపల్‌ కమిషనర్‌గా కె.వీరారెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లి నుంచి పోచారం మున్సిపాలిటీకి ఆయన బదిలీపై వచ్చారు. వీరారెడ్డికి మున్సిపల్‌ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

సైబర్‌ నేరాలపై అవగాహన

శామీర్‌పేట్‌: శామీర్‌పేట పోలీస్‌ స్టేషన్‌ ఆధ్వర్యంలో బుధవారం శామీర్‌పేటలోని ఎస్‌పీఆర్‌ కళాశాలలో సైబర్‌ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అపరిచిత మెసేజ్‌లు, లింక్స్‌ను డౌన్‌లోడ్‌ చేయవద్దని విద్యార్థులకు పోలీసులు వివరించారు. అలాగే ర్యాగింగ్‌ చట్ట రీత్యా నేరమని... అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కీసరగుట్ట ఆలయ హుండీ లెక్కింపు



కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. గడచిన ఐదు నెలల్లో భక్తులు హుండీ ద్వారా స్వామివారికి రూ. 20 లక్షల కానుకలను సమర్పించారని ఆలయ చైర్మన్‌ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్‌ టి.శేఖర్‌, వీజీఎల్‌ అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై హైడ్రా కన్నెర్ర

- జవహర్‌నగర్‌లోని చెరువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌
- ఎఫ్‌టీఎల్‌ పరిధిలో అక్రమ నిర్మాణాలను గుర్తింపు
- డంపింగ్‌యార్డ్‌ను తొలగించాలని జేఏసీ వేడుకోలు



ఇందిరమ్మ చెరువులో ఆక్రమణలను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌

జవహర్‌నగర్‌: చెరువులలో ఆక్రమణలపై హైడ్రా కమిషనర్‌ కన్నెర్ర జేశారు. హైదరబాద్‌ పరిసర ప్రాంతాలలో తనదైన శైలిలో ఆక్రమణదారుల్లో వణుకు పుట్టిస్తున్న హైడ్రా టీం బుధవారం జవహర్‌నగర్‌లో పర్యటించింది. మొదట ఇందిరమ్మ చెరువు (అంబేడ్కర్‌నగర్‌)లో వెలసిన అక్రమ నిర్మాణాలను పరిశీలించి ఆ తర్వాత రాంకీ నిర్వహిస్తున్న డంపింగ్‌ యార్డ్‌ పరిసర ప్రాంత చెరువులను పరిశీలించారు. డంపింగ్‌ యార్డ్‌తో హరిదాస్‌పల్లి చెరువు, దమ్మాయిగూడ పరిసర ప్రాంతాల పంటపొలాలు పూర్తిగా కలుషితమయ్యాయని అక్కడి రైతులు, దమ్మయిగూడ చైర్‌పర్సన్‌ ప్రణీత, డంపింగ్‌ జేఏసీ సభ్యులు హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌కు వివరించారు. అనంతరం చెన్నాపురం చెరువు ఆక్రమణలను పరిశీలించి, సర్వే నెం.474లో వచ్చిన ఫిర్యాదు మేరకు అక్కడ ఉన్న స్విమింగ్‌పూల్‌ గెస్ట్‌హౌస్‌ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌ మాట్లాడుతూ... ఎఫ్‌టీఎల్‌ ప్రాంతాల్లో వెలసిన నిర్మాణాలను తొలగించి బాధితులకు పురనావాసం కల్పిస్తామన్నారు.

హైడ్రా పేరుతో బెదిరింపులకు పాల్పడితే ఫిర్యాదు చేయండి

హైడ్రా పేరుతో కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్‌ రంగనాథ్‌ కోరారు. పర్యావరణాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిదని ముఖ్యంగా చెరువులు, కుంటలను కబ్జా చేస్తే భవిష్యత్‌ తరాలకు ఇబ్బందులు తప్పవన్నారు. అంబేడ్కర్‌నగర్‌ ఇందిరమ్మ చెరువులో 50 పైగా అక్రమణలను గుర్తించామని త్వరలో వాటిని తొలగిస్తామన్నారు. అక్రమ నిర్మాణాలలో ఎలాంటి వ్యత్యాసాలు ఉండవని కబ్జా చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. కాప్రా తహసీల్దార్‌ సుచరిత, జవహర్‌నగర్‌ కమిషనర్‌ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆర్‌వో ప్రభాకర్‌యాదవ్‌, ఆర్‌ఐలు సాయి, రమేష్‌, టీపీవో శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన అవసరం: కలెక్టర్‌ గౌతమ్‌



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌ గౌతమ్‌, కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు బుధవారం కలెక్టరేట్‌లో మట్టి గణేష్‌ విగ్రహాల పోస్టర్లను జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ ఆవిష్కరించారు.పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్‌ పేర్కొన్నారు. మట్టి గణపతి- పర్యావరణ పరిరక్షణపై విద్యాసంస్థల్లో క్విజ్‌ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చేతివృత్తిదారులకు మట్టి విగ్రహాల తయారీపై శిక్షణ ఇవ్వాలన్నారు. చెరువుల్లో మట్టి మేటలను తొలిగించటానికి, చెరువుల్లో స్వచ్ఛత కాపాడటానికి వినాయక చవితి పర్వదినాన భక్తులు నడుం బిగించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి మట్టి వినాయక విగ్రహాన్ని ఆవిష్కరించారు. మేడ్చల్‌ ఎన్విరాన్మెంటల్‌ ఇంజినీర్‌ రాజేందర్‌, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థలాన్ని తిరిగి అప్పగించాలని ఎంపీకి వినతి



ఎంపీ ఈటలకు వినతిపత్రం సమర్పిస్తున్న కీసరవాసులు

కీసర: మహిమాన్వితమైన కీసర శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయానికి సంబంధించిన సుమారు ఎకరం గ్రామ కంఠం భూమిని కబ్జా చెర నుంచి విముక్తి కల్పించి తిరిగి ఆలయానికి అప్పగించాలని బుధవారం కీసర గ్రామస్తులు ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... కీసర-భోగారం ప్రధాన రహదారిలోని సుమారు ఎకరం దేవస్థానంకు చెందిన గ్రామ కంఠం భూమిని కొందరు కబ్జాచేసి ప్రహరీ నిర్మించారన్నారు. ఈ విషయంలో గతంలో ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించామన్నారు. గ్రామ నేతలు జూపల్లి అశోక్‌, నల్ల వెంకట్‌రెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.